
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెరుగుతున్న జ్వర పీడితులు



- ఇంటింటా సర్వేలో బాధితుల గుర్తింపు
- ఆశాలు, ఏఎన్ఎంలతో వివరాల సేకరణ
- జిల్లాలో 16,728 మంది బాధితులు
- ఉచితంగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ

జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజురోజుకూ జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసు పత్రుల్లో ఓపీల సంఖ్య సైతం ఎక్కువవుతోంది. ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇచ్చిన ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ జిల్లా వ్యాప్తంగా ఫీవర్ సర్వే నిర్వహిస్తోంది. ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ప్రతిఇంటికి వెళ్లి జ్వరం లక్షణాలు ఉన్న వారికి నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నారు. బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను సైతం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. వారంలో ఒకరోజు విధిగా డ్రైడేగా పాటించాలని ప్రచారం చేస్తూ మలేరియా, డెంగీలతో పాటు సీజనల్ వ్యాధులను కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నారు. సర్వేనివేదికను ప్రతీరోజు హైదరాబాద్ వైద్య ఆరోగ్య శాఖకు పంపుతున్నారు.

● బాధితులకు పరీక్షలు

జిల్లా వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన జ్వర సర్వేలో 16,728 మంది బాధితులను వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలో 2,60,516 కుటుంబాలు ఉండగా, 10,98,959 జనాభా ఉంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితో పాటు ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, ఇతర ప్రభుత్వ వైద్యశాలలో 3,05,589 మందికి ఓపీ సేవలు అందించినట్లు వైద్య ఆరోగ్యశాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కోరుట్ల ఏరియా ఆసుపత్రి పరిధిలో అత్యధికంగా 5,216 మంది, జగిత్యాలలోని జనరల్ ఆసుపత్రి పరిధిలో 1,420మంది, ధర్మపురి సీహెచ్‌సీలో 2,323 మంది, రాయికల్ సీహెచ్‌సీలో 1,315 మంది జ్వర పీడితులు ఉన్నారు. మెట్‌పల్లి సీహెచ్‌సీలో 833మంది జ్వరపీడితులను గుర్తించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యధికంగా కల్లెడ పీహెచ్‌సీ పరిధిలో 605 మంది, అయిలాపూర్ పీహెచ్‌సీ పరిధిలో 531 మంది జ్వరపీడితులు ఉండగా, అత్యల్పంగా కొడిమ్యాల పీహెచ్‌సీపరిధిలో 126 మంది బాధితులు ఉన్నట్లు సర్వేలో తేల్చారు. జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాలు, పల్లెల్లో గృహాలను సందర్శించి ప్రమాదకరమైన దోమల వృద్ధికి కారణ మయ్యే లార్వా ఉన్నట్లుగా గుర్తించారు.

తక్కళ్లపల్లిలో జ్వర సర్వే చేస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది





జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

● వైద్య శిబిరాలు ఏర్పాటు

జిల్లాలో చేపడుతున్న సర్వే ద్వారా జ్వర పీడితులను ముందుగా గుర్తించి కట్టడికి ప్రయత్నిస్తున్నారు. జిల్లాలో 24మంది మెడికల్ ఆఫీసర్లు, 754మంది ఆశా కార్యకర్తలు, 80మంది సూపర్‌వైజర్లు, 268 మంది ఏఎన్ఎంలు, 101మంది ఎంఎల్‌హెచ్‌పీలు 28మంది హెల్త్ అసిస్టెంట్లు బృందాలుగా ఏర్పడి సర్వే చేస్తున్నారు. అనుమానితుల రక్త నమూనాలు సేకరించి మలేరియా, డెంగీ, చికున్ గున్యా మొదలైన జ్వరాల నిర్ధారణ కోసం ఎన్ఎస్-1, ఎన్ఎస్-ఎలీసా పరీక్షలు నిర్వ హిస్తున్నారు. అవసరమైన రోగులకు మెరుగైన చికిత్స కోసం ఆసు పత్రులకు తరలిస్తున్నారు. జిల్లాలో వర్షాకాలం ముగిసే వరకు విడతల వారీగా జ్వరాల సర్వేను చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన సర్వే ఆధారంగా బాధితులను బట్టి మెడికల్ క్యాంపులు పెడుతున్నారు. ఇందులో జ్వర పీడితులను గుర్తించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

● పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పలు ఇళ్లలో కూలర్లలో నిల్వ ...

మిగతా 8లో

'వికలాంగుల సంక్షేమానికి చర్యలు'



కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వికలాంగుల సంక్షేమానికి చర్యలు తీసుకొని బాల్యం నుంచే వారికి పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్‌ను గురువారం రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో కలిసి ఆయన వినతిపత్రాన్ని అందించారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగుల పెన్షన్ రూ.300 నుంచి 3వేలకు పెంచాలని కోరారు. 2014లో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క రూపాయి పెన్షన్ కూడా పెంచలేదని ఆయన గుర్తు చేశారు. మంత్రి వెంట కాంగ్రెస్ చేనేత విభాగం చైర్మన్ గూడూరి శ్రీనివాస్, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేట్ ప్రెసిడెంట్ కోట మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

జగిత్యాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత డిమాండ్ చేశారు. జగిత్యాల నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానాలపై వసంత సమావేశం నిర్వహించి మాట్లాడారు. రిజర్వేషన్ అంశంపై కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేస్తే రాహుల్ గాంధీ మద్దతు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ కుట్ర

-కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మూడేళ్లలోనే అద్భుతమైన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి చరిత్ర సృష్టించిన కేసీఆర్‌పై రాజకీయ కక్ష సాధించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యంతో పాలనను గాలికి వదిలి బీఆర్ఎస్‌పై బురద జల్లడమే పనిగా పెట్టుకుని కుట్రపూరిత విమర్శలు చేస్తున్నరన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు పుల్ల జగన్‌గౌడ్, డాకూరి వెంకటేష్, ముదాం అనిల్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మెట్‌పల్లి టౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మెటపల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అందజేశారు.

●కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, నందయ్య, రమేష్, నగష్, మోహన్ రెడ్డి, ఫహీం, అన్వర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

బీర్‌పూర్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవాలని గురువారం బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో కప్పతల్లి ఆట ఆడారు. గ్రామంలోని గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన రైతులు కప్పలకు వివాహం జరిపించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నవీన్‌రావ్, మాజీ సర్పంచ్ యేసుదాసు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి జగిత్యాలకు చెందిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి మాట్లాడినట్లుగా కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ కరుణాకర్‌కు గురువారం కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. సంబంధిత వ్యవహారంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సెక్రెటరీ గాజుల శంకర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాజుల రాజేందర్, దుర్గయ్య, గుండా మధు పాల్గొన్నారు.

రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

జగిత్యాలరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్ ను జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో సీఐ సుధాకర్, ఎస్సై సధాకర్ ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ సలీం గురువారం తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట పీహెచ్ సి డాక్టర్ హరీష్, గ్రామ పంచాయతీ సెక్రటరీ రామకృష్ణ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాల క్రైం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని భవాని నగర్‌లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై టౌన్ ఎస్సై సుప్రియ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద రూ.7,525 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల ఐటీఐలో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ గంట్యాల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. జగిత్యాల ఐటీఐలో ప్రవేశం కోరు అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ వరకు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు. 10 వ తరగతి పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులను మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని తెలిపారు.

యూరియా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

-భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలి-అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత



రికార్డులు తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత

గొల్లపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘంలో యూరియా నిల్వలను ఎప్పటికప్పుడు ప్రద ర్శిస్తూ రైతుల పంట విస్తీర్ణం ఆధారంగా యూరి యాను విక్రయించాలని అడిషనల్ కలెక్టర్ బీఎస్ లత అన్నారు. యూరియా విక్రయాల్లో అవకతవకలకు పాల్పడితే సంబంధిత అధికారుల పై కఠిన చర్యలు తప్పవని అడిషనల్ కలెక్టర్ బీ.ఎస్. లత హెచ్చరించారు. గురువారం గొల్లపల్లి సింగిల్‌విండో కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా నిల్వలు, విక్రయాల రిజిష్టర్‌లను, రైతుల వివరాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. జిల్లాలోని అన్ని సహకార సంఘాల్లో యూరియా నిల్వలను ప్రదర్శించాలని, యూరియాను గరిష్ఠ చిల్లర ధరకు విక్రయించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి పలు రికార్డులను, రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. వన మహోత్సవంను వంద శాతం పూర్తి చేయాలని, ఈజీఎస్ పనులను నిర్వహించాలని, ఉపాధి హామీ కూలీలకు పని దినాలు కల్పించాలని ఆదేశించారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న భూభారత రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ప్రజల నుంచి వచ్చిన వివిధ రకాల భూసమస్యలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ బీ.ఎస్. లత అధికారులను ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భూభారతి రెవెన్యూ సదస్సులకు సంబంధించిన రికార్డులను, రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ కట్కం వరందన్, ఆర్ఐ లు జీవన్, అనూష, ఎంపీడీవో రాంరెడ్డి, ఎంపీవో సురేష్ రెడ్డి, సింగిల్‌విండో సీఈవో బెజ్జెంకి రాంసుధాకర్ రావు, సిబ్బంది సుద్దాల స్వరూప, శైలజ, వావిలాల పవన్, మారంపల్లి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్

రాయికల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నియంత్రణకు సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని జగిత్యాల జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. మండలంలోని ఒడ్డెలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. 1-19 సంవత్సరాల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. గర్భిణీ స్త్రీల నమోదు, తదుపరి సేవలు, పర్యవేక్షణ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలను పెంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి జైపాల్ రెడ్డి, మండల వైద్యాధికారి కస్తూరి సతీష్ కుమార్, ఎన్‌హెచ్ఎం అధికారి రవీందర్, ఏఎంవో సత్యనారాయణ, పర్యవేక్షకులు సాగర్ రావు, శ్రీధర్, మురళీధర్, శ్రీనివాస్, హెచ్ఈవో భూమేశ్వర్, ఎంఈవో ఎనుగంటి రాజేష్, ఒడ్డెలింగాపూర్ ప్రాథమిక కేంద్రం పర్యవేక్షకుడు శ్రీనివాస్, ఇస్తేరు రాణి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డైరెక్టర్

మల్యాల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లిలో గల బాలికల గురుకుల పాఠశాలను గురువారం విద్యాశాఖ డిప్యూటి డైరెక్టర్ ఎన్.వీ దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల వసతిగృహంలో భోజనం పరిశీలించారు. గ్రంథాలయం, ల్యాబ్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పాఠ్యాంశాల ప్రణాళిక, బోధన డైరీలు, జవాబు పత్రాలను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. భోజనం, బోధన పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పదవి విరమణ ఈ నెలాఖరులో ఉండగా ఉపాధ్యాయులతో కలిసి సన్మానించారు. పదవ తరగతిలో పాఠశాల రాష్ట్రస్థాయి ఫలితాలు సాధించడం పట్ల ప్రిన్సిపాల్ మానసను అభినందించి సత్కరించారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి రాము, మండల విద్యాధికారి జయసింహరావు, సెక్టోరియల్ అధికారి రాజేశ్, ఏపీవో రమణ ఉన్నారు.

యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కథలాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కోరుట్ల వ్యవసాయ అదనపు సంచాలకులు రమేశ్ పేర్కొన్నారు. మండలంలోని గంభీర్‌పూర్‌లో ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు సింగిల్ విండో గోదాంలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎప్పటికప్పుడు యూరియా నిల్వలపై సమచారం తెలిపే బోర్డులు ప్రదర్శించాలని సూచించారు. అదేవిధంగా రైతులు మోతాదుకు మించి ఎరువులు వాడకుండా విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని సిబ్బందికి వివరించారు. ఈ సందర్భంగా ఏఈఓ శేఖర్, డీలర్లు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ

రాయికల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్ కుమార్ అన్నారు. ఇటిక్యాల గ్రామానికి చెందిన నిగ రాజు, పున్నం లావణ్యలకు చెందిన ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోసి, ఆన్‌లైన్ చేశారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సామల్ల వేణు, పోతవేణి రాజేందర్ గౌడ్, ఏలేటి జలంధర్ రెడ్డి, మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, కొడిపెల్లి స్వామి రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్‌బాక్సుల వితరణ

కథలాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దుంపెట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు దండిక ప్రవీణ్ అనే వ్యక్తి రు. 12 వేల విలువైన సౌండ్ బాక్సులు వితరణగా అందజేశారు. పాఠశాలలో జరిగే అధికారిక కార్యక్రమాలకు బాక్సులు ఉపయోగపడతాయనే ఉద్దేశ్యంతో తన వంత సహకారం అందజేసినట్టు ప్రవీణ్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జగిత్యాల , ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్ ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురు వారం మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న నిరహర దీక్షలు రెండవ రోజయిన గురువారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రోజు రెండు కూరలతో భోజనం పెట్టాలని అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. మెనూ ప్రకారం ఒక్కో విద్యార్థికి 25 రూపాయలు చెల్లించాలని లేదా గ్యాస్ కోడిగుడ్లు, ఇతర నిత్యావసర వస్తువులు ప్రభుత్వమే సరఫరా చేయాలని అప్పుడు నాణ్యమైన భోజనం అందించేందుకు వీలవు తుందని అన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్క రించకుంటే సెప్టెంబర్ 1 వ తేదీన నిరవదిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వెన్న మహేష్, రాధ, సుజాత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

- జాతీయ పసుపు బోర్డు చైర్మన్ గంగారెడ్డి



మాట్లాడుతున్న పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి

మల్లాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు సేంద్రియ పద్ధతిలో పసుపును సాగు చేసి నాణ్యమైన దిగుబడి పొందాలని జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి సూచించారు. గురువారం పసుపు పంట సాగులో చేబట్టవాల్సిన మెలకువలపై మండలంలోని కొత్తధాంరాజుపల్లి గ్రామంలోని రైతువేదికలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జరిగిన పసుపు సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గంగారెడ్డి మాట్లాడుతూ పసుపు రైతులంతా ఎఫ్‌పీవోగా రూపొందించి ప్రభుత్వం కల్పించే రాయితీలను పొందాలని వివరించారు. పసుపు సాగు, మెలకువలు, యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై ఉద్యాన శాస్త్రవేత్త మహేందర్ రైతులకు వివరించారు. ముందుగా రైతులు జాతీయ పసుపు బోర్డు చైర్మన్ శాలువలతో ఘనంగా సన్మానించారు. జరిగి సదస్సులో ఉద్యానశాఖ జిల్లా అధికారి శ్యామ్‌ప్రసాద్, కోరుట్ల డివిజన్ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి లావణ్య, కేనేరా బ్యాంకు మేనేజర్ సురేష్‌తో పాటు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి దారుణహత్య

- కర్ర, బండ రాయితో మోది నీరు లేని బావిలో పడేసిన వైనం

6

ఒకే రోజు తండ్రీకొడుకు మృతి

- సోమన్‌పల్లి గ్రామంలో విషాదం

6

ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల

7

గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయండి

హుజూరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో శుక్రవారం జరిగే గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శనిగరం బాబ్జీ అన్నారు. గురువారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పీడిత, తాడిత ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గద్దర్‌కు ఘన నివాళులర్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్, ప్రధానవక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాసిం హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి రచయితలు, కళాకారులు, కవులు, మేధావులు, విద్యా వంతులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అనిల్ కుమార్, వెంకన్న, సుధాకర్, విజయేందర్, రాజన్న, తిరుపతి, రహీం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ గ్రామంలో గురువారం ఆటో-బైకు ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులోని జూపాక క్రాస్‌రోడ్డు వద్ద హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్తున్న బైక్‌ను ఆటో ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో ఆరుషి, పద్మ, సాయికృష్ణ, లక్ష్మి, తిరుపతికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యార్థులకు తప్పని నిరీక్షణ

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 105.50 కోట్లు
- ఊసేలేని వన్‌టైం సెటిల్‌మెంట్

గణేశ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంవత్సరం ముగిసినా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో ఇతర కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫీజులు కడితే కాని సర్టిఫికెట్లు ఇవ్వబోమని చెప్పడంతో పేద విద్యార్థులు ఆందోళన చెందు తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రైవేట్ కళాశాలలకు వన్‌టైం సెటిల్ మెంట్ చేస్తామని గత ఏడాది ప్రభుత్వం హామీ ఇచ్చింది. సంవత్సరం దాటుతున్నా బకాయిల చెల్లింపులు లేకపోవడంతో విద్యాసం స్థల యాజమాన్యాలు, విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 105.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి సుమారు 30 నుంచి 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2022- 23, 2023-24, 2024-25, సంవత్సరాలకు సంబంధించి బీసీ, ఈబీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్నది. సుమారు 35 వేల మంది బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఇందు లో ఎక్కువ శాతం మంది ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్నారు. వీరికి రెండేళ్లుగా రూ.77 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులకు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. సూమారు మూడు వేల మంది విద్యార్థులకు రూ. 16.28 కోట్లు విడుదల కావాల్సి ఉంది. 2,429 మంది ఎస్టీ విద్యార్థులకు సంవత్సరం కాలంగా సుమారు రూ.7.80కోట్లు, మైనార్టీ విద్యార్థులకు రూ.4.50 కోట్లు పెండిం గ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కావడం లేదు. నెల నెలా విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్ కూడా విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆందోళన చెందుతున్న విద్యార్థులు

నిధుల కొరతతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని కళాశాలల్లో యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడంతో ఆందోళన చెందుతున్నారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి కాగితాలు రాయించుకుని ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు విడుదల చేసిన తర్వాత తిరిగి తమకు చెల్లిస్తామని చెపుతున్నారని విద్యార్థులు అంటున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమౌంట్ ఎస్సీ విద్యార్థులకు నేరుగా వారి అకౌంట్‌లోకి జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపే ప్రయత్నం చేస్తుండగా, ఈ కొత్త విధానంతో మరో సమస్య వచ్చి పడుతుందని ఇటు విద్యార్థులు, అటు యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఎన్నం ప్రకాష్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

రాష్ట్ర వ్యాప్తంగా మూడు సంవత్సరాలుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. వెంటనే పాత బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి. లేని పక్షంలో ప్రభుత్వంపై ఉద్యమిస్తాం.



బకాయిలు చెల్లించి కొత్త విధానం అమలు చేయాలి

కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

2024-25 విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ విద్యార్థులకు వారి ఖాతాల్లో నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌జమ చేయడం బాగుంది. కానీ బకాయిలను విడుదల చేసిన తర్వాతనే కొత్త విధానం అమలు చేయాలి.



ప్రైవేటు కళాశాలలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదు..

చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘం నాయకుడు

ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీల తో పాటు బీసీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థుల ఖాతాలో నిధులు జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.



శతాధిక వృద్ధురాలు మృతి



మీరిబాయి(ఫైల్)

రుద్రంగి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల బడితండా గ్రామంలో మీరిబాయి(120) అనే శతాధికవృద్ధురాలు అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మీరిబాయికి నలుగురు కుమారులు, కూతురు కాగా, 105 మంది మనుమళ్లు, మనుమరాళ్లు, మునిమనుమలు ఉన్నారు. ఇప్పటివరకు మీరిబాయి తన పనులు తానే చేసుకుంటుండేదని, 15 రోజులుగా వృద్ధురాలు అనారోగ్యం బారిన పడటంతో మృతిచెందినట్లు తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలు భరించలేక వంగల దేవరెడ్డి(70) అనే వృద్ధుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని దేవరెడ్డి కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధ పడుతున్నాడు. వ్యవసాయ పనులు చేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడం.. అనారోగ్య సమస్యలు అధికమవడం వల్ల జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు. మృతుడికిభార్య విజయ, కొడుకు రవీందర్‌రెడ్డి, కూతురు రజిత ఉన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



రంజిత్(ఫైల్)

జూలపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన ఐలవేని రంజిత్(25)గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం మధ్యాహ్నం గ్రామంలోని ఒక బెల్టుషాపులో మద్యం సేవించేందుకు వెళ్లాడు. బెల్టుషాపులో డబ్బును దొంగతనం చేశాడని నిర్వాహకులు రంజిత్‌ను ప్రశ్నించారు. డబ్బులు దొంగలించలేదని తెలిపినా నిర్వాహకులు వినలేదు. దుస్తులు విప్పి చూపించాలనడంతో రంజిత్ దుస్తులను విప్పినట్లుగ్రామస్థులు, కుటుంబసభ్యులుపేర్కొన్నారు. ఈ విషయమై తీవ్ర మనస్తాపానికి గురైన రంజిత్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సాయంత్రం రంజిత్‌అన్న గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు.

బొమ్మనపల్లిలో చైన్ స్నాచింగ్

చిగురుమామిడి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలోగల ఓ ప్రైవేట్‌పాఠశాల వద్ద గురువారం సాయంత్రం మహిళ మెడ నుంచి మూడు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఆయనతెలిపిన వివ రాలిలా ఉన్నాయి.. హుస్నాబాద్ నుంచి సైదాపూర్ వైపు ద్విచక్ర వాహ నంపై ధనలక్ష్మి, ఆమెభర్త ప్రకాశ్‌తో కలిసి వెలుతోంది. వారిని వెంబడిస్తూ మరో ద్విచక్రవాహనంపై వచ్చిన ఆగంతకుడు ధనలక్ష్మి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును అపహరించినట్లు తెలిపారు. బాధి తురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశామన్నారు. సంఘటన స్థలం సమీపంలో ఉన్నపాఠశాల సీసీపుటేజీలను పరిశీలించినట్లుఎస్సై తెలిపారు.

వెంకటాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అతివేగం, అజాగ్రత్తగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన కామారెడ్డి జిల్లాకు చెందిన సంతోష్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కంటి వైద్యుడు శ్రీనివాస్ తన కారులో సిరిసిల్ల నుంచి వెంకటాపూర్ మీదుగా ముస్తాబాద్ వెళ్లి తిరుగు పయనమయ్యాడని పేర్కొన్నారు. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపుకు వెళ్తున్న సంతోష్ అతివేగంగా దూసుకు వచ్చి ఎదురుగా వస్తున్న శ్రీనివాస్ కారును ఢీకొట్టాడు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికురాలిపై లైంగిక వేధింపులు

కోల్‌సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికురాలిని పనిస్థలంలో లైంగికంగా వేధింపులకు గురిచేశాడనే ఫిర్యాదుపై సూపర్‌వైజర్ తాజుద్దీన్‌పై గురువారం కేసు నమోదుచేసినట్టు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. బాధితురాలిని కొంతకాలంగా తాజుద్దీన్ వేధిస్తున్నాడని పేర్కొన్నారు. బుధవారం పనులు కేటాయించే సమయంలో నీ సంగతి చూస్తానని, నిన్ను రోడ్డు మీద నిలబెడతానంటూ అసభ్యపదజాలంతో దూషించినట్టు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

ఇయర్ ఫోన్స్ ఎంత పనిచేశాయి..

- పాటలు వింటూ ఒకరు.. ఫోన్ చూస్తూ మరొకరు
- రైలు పట్టాలపై వెళుతుండగా ప్రమాదం
- ఇద్దరు యువకుల దుర్మరణం

మధ్యప్రదేశ్‌కు చెందిన దిలీప్‌కుమార్, ఆకలేష్ శ్రీరాంవార్థడే వరసకు బావ,బామమరుదులు.. జమ్మికుంట మండలం మడపల్లి రైల్వేగేట్ సమీపంలోని సిమెంట్‌బ్రిక్స్ కంపనీలో పనిచేసేందుకు వచ్చారు. తమ బ్యాగులు కంపెనీ ఆవరణలో పెట్టి సమీపంలో రైల్వే ట్రాక్ వైపు వెళ్లారు. ఆకలేష్ శ్రీరాం వార్థడే ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటూ.. దిలీప్‌కుమార్ ఫోన్ చూస్తూ ట్రాక్‌పై నడుస్తున్నారు. ఆ ప్రాంతంలో ట్రాక్ వంపుగా ఉంటుంది. వెనక నుంచి వచ్చిన రైలును వారు గమనించలేదు. వేగంగా వచ్చిన రైలు ఇద్దరు యువకులను ఢీకొని వెళ్లిపోయింది. ఉపాధి కోసం వచ్చిన ఇద్దరు యువకుల జీవితాలు అర్ధాతరంగా ముగిశాయి.



దిలీప్ కుమార్, ఆకలేష్ శ్రీరాం వార్థడే (ఫైల్)

జమ్మికుంట/జమ్మికుంట రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని మడిపల్లి కెనాల్ రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మధ్యప్రదేశ్‌లోని చిఖిలి గ్రామానికి చెందిన దిలీప్ కుమార్(25), మహారాష్ట్రలోని సీతపర్ గ్రామానికి చెందిన ఆకలేష్ శ్రీరాం వార్థడే(25) మృతి చెందారు. వీరిద్దరూ మడిపల్లి రైల్వేగేట్ సమీపంలో ఉన్న సిమెంట్ బ్రిక్స్‌లో పనిచేసేందుకు మంగళవారం సాయంత్రం వచ్చారు. తమవెంట తెచ్చుకున్న బ్యాగులను సిమెంట్‌బ్రిక్స్ కంపెనిలో పెట్టారు. బహిర్భూమికి వెళ్లొస్తామని సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లారు. ఆకలేష్ శ్రీరాం వార్థడే చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని, దిలీప్‌కుమార్ ఫోన్ చూస్తూ ట్రాక్‌మీద నడుచుకుంటూ వెళ్లారు. గుర్తుతెలియని రైలు వారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అటువైపు వెళుతున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్ స్టేషన్ మాస్టర్‌కు ఫోన్‌చేసి రైల్వేట్రాక్ పక్కన రెండు మృతదేహాలు కనిపిస్తున్నాయని సమాచారం అందించాడు. ట్రాక్‌మన్ అక్కడ వెళ్లి ఇద్దరు యువకుల మృతదేహాలు ఉన్నట్లు గుర్తించి రైల్వే పోలీస్‌లకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీస్‌లు పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మడిపల్లి కెనాల్ వద్ద రైల్వే ట్రాక్ వంపుగా ఉంటుంది. ఆ ప్రాంతంలో రైలు సమీపంలోకి వచ్చే వరకు కనిపించదు. ఇద్దరు యువకులు ఫోన్‌లో నిమగ్నమై ఉండడంతో ప్రమాదం జరిగి ఉంటుందని రైల్వే పోలీస్‌లు భావిస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా పూర్తి చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే ట్రాక్‌ల వద్దకు ప్రజలు వెళ్లొద్దని, వెళ్లినా అప్రమత్తంగా ఉండాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి తిరుపతి సూచించారు. మడిపల్లి కెనాల్ వద్ద ట్రాక్ వంపుగా ఉండడంతో ఆ ప్రాంతంలో రైళ్ల సమీపంలోకి వచ్చేవరకు ఏర్పడదని, ఇటువైపు వచ్చే వారు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

రోడ్డుపై ఇరుక్కుపోయిన స్కూల్ బస్, లారీ

జమ్మికుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కూరగాయల మార్కెట్‌రోడ్డులో స్కూల్ బస్ వెంట్రుక సందులో ఇరుక్కుపోయాయి. దీంతో 15నిమిషాల పాటు రెండు వాహనాలు ఎటూ కదలకుండా ఉండిపోయాయి. ఇరువైపులా వాహనాలు నిలిచి రాకపోకలకు తీవ్రఅంతరాయం కలిగింది. ఇతర వాహనదారుల సూచన మేరకు ఇద్దరు డ్రైవర్లు ఒకదానికి మరొకటి తగలకుండా వాహనాలను ముందుకు తీసుకెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారీవాహనాలు ఇరుకు రోడ్డు గుండా రాకుండా పోలీస్‌లు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



మార్కెట్ రోడ్డులో ఇరుక్కుపోయిన స్కూల్ బస్, లారీ

30 తులాల బంగారం చోరీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వివేకానంద పురి కాలనీలోని భార్గవ్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో ఓఫ్లాట్‌లో బుధవారం అర్ధ రాత్రి దొంగలుచొరబడి 30తులాల బంగారం అపహరించుకు పోయారు. కరీంనగర్ మూడోటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంధం వేదవ్యాస్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో కొద్దిరోజులుగా రంగులు వేస్తుండటంతో ఆయన కుటుంబం శ్రీపురంకాలనీలో ఉంటున్నారు. ఉదయం నుంచిసాయంత్రం వరకు ఫ్లాట్‌లో ఉంటూ రాత్రి శ్రీపురంకాలనీ ఇంటికి వెళ్లిఅక్కడే నిద్రిస్తున్నారు. బుధవారం రాత్రి 9గంటలకు ఫ్లాట్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లిన వేదవ్యాస్‌కు గురువారం ఉదయం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండేవ్యక్తి ఫోన్‌చేసి తాళం పగులగొట్టి ఉందని సమాచారం ఇచ్చాడు. వెంటనే వెళ్లి చూడగా బీరువా తెరచి బట్టలు, ఇతరవస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలోని 30తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు.

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో తాళం వేసి ఉన్న మరాఠి లక్ష్మి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని లక్ష్మి భర్త నాలుగేళ్ల కిందట చనిపోవడంతో ఇంటిలో ఒంటరిగా జీవిస్తోంది. గతనెల 30న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులో ఉంటున్న తన తల్లిగారింటికి వెళ్లింది. ఈనెల 6నరాత్రి ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి తాళం పగులకొట్టి కనిపించింది. బీరువా ధ్వంసమవడంతోపాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.5వేల నగదు, రూ.12.5వేల విలువైన బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామ శివారులో గురువారం ట్రాక్టర్‌ను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌లపై కేసునమోదుచేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు

బొంపల్లిలో గంజాయి పట్టివేత

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి శివారులోఆటోలో ముగ్గురువ్యక్తులు గంజాయిని తీసుకెళ్తుండగా పెద్దపల్లి రూరల్‌పోలీసులు పట్టుకున్నారు. రూరల్‌ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన అస్లాం, ఫయాజ్, ఖాజా అనే ముగ్గురు జిల్లాకేంద్రం నుంచి గుర్తుతెలియని వ్యక్తినుంచి 100గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి ఆటోలో బొంపల్లి మీదుగా కరీంనగర్ వెళ్తుండగా రూరల్ పోలీసులు తనిఖీ చేశారు. గంజాయి స్వాధీనం చేసుకొని ఆటోతో పాటు ముగ్గురుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

ఒకే రోజు తండ్రీకొడుకు మృతి

- అనారోగ్యంతో తండ్రి.. ఆత్మహత్య చేసుకుని కొడుకు..
- జగిత్యాల జిల్లా సోమన్‌పల్లి గ్రామంలో విషాదం



తిరుపతి, వెంకన్న(ఫైల్)

జగిత్యాలరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా జగిత్యాలరూరల్ మండలం సోమన్‌పల్లి గ్రామంలో గురువారం తండ్రీ కొడుకు ఇద్దరూ ఒకేరోజు మృతి మృతిచెందడంతో విషాదం అలుముకుంది. గురువారం తెల్లవారుజామున చంద వెంకన్న(65) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తుండగా తీవ్ర మనస్థాపంతో అతని కుమారుడు చంద తిరుపతి (31) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్, గ్రామస్థుల కథనం ప్రకారం చంద వెంకన్న కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఆరోగ్యం క్షీణించి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. తిరుపతి తన తండ్రి మృతితో మనస్థాపం చెంది తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనితో వెంకన్న మనమడు అతనికి అంత్యక్రియలు నిర్వహించాడు. రెండు గంటల అనంతరం కొడుకు తిరుపతి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే రోజు తండ్రీకొడుకు మృతిచెందడంతో సోమన్‌పల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గతంలో వెంకన్న పెద్దకుమారుడు రవి దుబాయ్‌లో హత్యకు గురయ్యాడు. తిరుపతి భార్య చంద సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు. తిరుపతికి రూ.5లక్షల వరకు అప్పులు ఉన్నాయనిచ ఒక వైపు తండ్రి మరణం కుంగదీయగా, అప్పులు ఎలా తీర్చలనే వేదనతో ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది.

కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న నిర్వహించనున్న మూడవ ఎడిషన్ ఆఫ్ కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గతరెండు మారథాన్‌లను విజయవంతంగా నిర్వహిం చిన రన్నర్స్ సైక్లిస్ట్ అసోసియేషన్‌ను అభినందించారు. ఈసంవత్సరం కూడా అందరూ పాల్గొనాలన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన తీసుకువస్తున్న కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ హాఫ్‌మారథాన్‌లో మూడు కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 21 కిలోమీటర్ల పరుగు ఉంటుందని ఈ సందర్భంగా హాఫ్ మారథాన్ నిర్వాహకులు పసుల మహేష్ తెలిపారు. ఈ మారథాన్‌లో పాల్గొనే వారందరూ karimnagarmarathon.com వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ

గణేశ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా ఎస్సారార్ కళాశాల ఫైనల్‌ఇయర్ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. 21శతాబ్దపు ఉద్యోగ నైపుణ్యాలను కళాశాల డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అందించడానికి మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. కళాశాలలో ఆగస్టు11వతేదీ నుంచి 12రోజులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం సృజన్‌దాస్, మ్యాజిక్‌బస్ ఇండియా శిక్షకురాలు పూర్ణశ్రీ, వైస్‌ప్రిన్సిపల్ నితిన్‌పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బీసీ గర్జన సభ వాయిదా

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో శుక్రవారం జరుపనున్న బీసీ గర్జనసభ వాయిదాపడింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిజిల్లాలో బీసీగర్జన సభలు నిర్వహించా లని బీఆర్‌ఎస్ నిర్ణయించి, మొదట 8న కరీంనగర్‌లో సభ ఏర్పాటుకు సన్నాహాలు చేసింది. అయితే వర్షాల కారణంగా సభను వాయిదా వేశామని బీఆర్‌ఎస్ నాయకత్వం ప్రకటించింది. కరీంనగర్‌లో ఈనెల14న బీసీగర్జన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నది.

వృద్ధురాలి దారుణ హత్య

- కర్ర, బండ రాయితో మోది నీరు లేని బావిలో పడేసిన వైనం



ప్రేమలత(ఫైల్)

జగిత్యాల క్రైం/కొడిమ్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలో మెన్నేని ప్రేమలత(70) అనేవృద్ధురాలు బుధవారం రాత్రి దారుణహత్యకు గురైంది. ప్రేమలత బుధవారం జగిత్యాలకు వెళ్లి రాత్రి తిరిగిఇంటికి వస్తుండగా కర్ర, బండరాయితో మోది హత్యచేసిన దుండగులు మృతదేహాన్ని ఆమెఇంటి సమీపంలోని నీరులేని బావిలో పడేయడం కలకలంరేపింది. గురువారం తెల్లవారు జామున గ్రామస్థులు మృతదేహాన్ని చూడడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తమ పొరుగింటి వారిని దూషించిదనే కారణంతోనే ఈ దారుణం చోటుచేసుకున్నట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ప్రేమలతకు ముగ్గురు కుమారులు కాగా పెద్దకుమారుడు కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు మెన్నే ని రాజనర్సింగరావు. ప్రేమలత ఒంటరిగానే నాచుపల్లి గ్రామంలో ఉన్నతన ఇంట్లో నివసిస్తోంది. ప్రేమలత ఇంటి సమీపంలో రఘునందన్‌రావు అనేవ్యక్తి డెయిరీ, ఫౌల్ట్రీ ఫాం నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. కొద్దిరోజులుగా ప్రేమలతకు, రఘు నందన్‌రావుకు మధ్య దూషణ జరిగినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా రఘునందన రావును ఆమెదూషించి నందువల్లే ఆమెను హత్యచేశారని అనుమానిస్తున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అరీఫ్ అలీఖాన్, మల్యాల సీఐరవి, కొడిమ్యాలఎస్సై సందీప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ బృందంతో పాటు ఫింగర్‌ప్రింట్ పోలీసులు పలు ఆధారాలు సేకరించారు. మృతురాలి కోడలు, మాజీఎంపీపీ మెన్నేని స్వర్ణలత గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

మత్తులో విద్యార్థి హల్‌చల్..

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మత్తులో ఓ విద్యార్థి హల్‌చల్ చేసిన సంఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలోని ఓ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ద్విచక్రవాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ మరో విద్యార్థి వాహనాన్ని ఢీకొన్నాడు. దీనితో ఇద్దరు విద్యార్థుల మధ్య మాటామాటా పెరిగి దుర్భాషలాడుకున్నారు. ట్రిపుల్‌రైడింగ్ చేస్తూ వచ్చిన విద్యార్థులు మరో విద్యార్థిపై దాడిచేశారు. దాదాపు అరగంటపాటు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సిరిసిల్ల పాతబస్టాండ్‌లో మత్తులో ప్రతిరోజు కొందరు పోకిరీలైన విద్యార్థులు ద్విచక్రవాహనాలపై రైడింగ్ చేస్తూ అసభ్యకరంగా వ్యహరిస్తున్నారు.

గురుకుల టెండర్లలో అయోమయం



- టెండర్ల ఫారం ధర నిర్ణయించని ప్రభుత్వం
- ఒక్కో జిల్లాలో ఒక్కో ధర..
- పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో రూ. 25 వేలు
- మిగతా జిల్లాల్లో రూ. 2 వేల నుంచి 10 వేల వరకు
- ఏకీకృత విధానంలో టెండర్లు అంటూ వేర్వేరు ధరలా?
- నిబంధనలు సవరించాలంటున్న కాంట్రాక్టర్లు
- లేకుంటే 12 నుంచి సరుకుల సరఫరా, క్యాటరింగ్ బంద్ చేయాలని నిర్ణయం

పెద్దపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలకు ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్ సరఫరాతోపాటు క్యాటరింగ్ చేసేందుకు కామన్ టెండర్లను ప్రభుత్వం ఆహ్వానించింది. అయితే ప్రభుత్వం టెండర్ ఫారాల ధరలను ఖరారు చేయలేదు. దీంతో ఆయా జిల్లాల కలెక్టర్లు తమకు తోచిన విధంగా ధరలను నిర్ణయించి టెండర్ నోటీసులు జారీ చేశారు. అత్యధికంగా పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కో టెండర్ ఫారం ధర 25 వేల రూపాయలు, మిగతా జిల్లాల్లో 2 వేల నుంచి 10 వేల రూపాయలు నిర్ణయించారు. కరీంనగర్ జిల్లాలో రూ.2 నుంచి 5 వేలు, ములుగు జిల్లాలో రూ.10 వేలు, నాగర్‌కర్నూల్, నారాయణపేట్ జిల్లాల్లో రూ.2 వేలు, హైదరాబాద్ జిల్లాలో రూ.3 వేలు, జగిత్యాల జిల్లాలో రూ.5 వేల ధర నిర్ణయించారు. దీంతో కాంట్రాక్టర్లు ఇదేమి విధానం అంటూ ప్రశ్నిస్తున్నారు. అలాగే జిల్లా యూనిట్‌గా ఆహార పదార్థాలు (కిరాణ సరుకులు), మండల యూనిట్‌గా కూరగాయలు-పండ్లు, మటన్-చికెన్, క్యాట రింగ్ టెండర్లను ఆహ్వా నించింది. జిల్లా, మండల యూనిట్లకు వేర్వేరుగా టెండర్లు దాఖలు చేయాలనుకునే ఒక కాంట్రాక్టర్ ఒకే ఫారంలో దరఖాస్తు చేయాలా లేక వేర్వేరుగా టెండర్ దాఖలు చేయాలా అనే విషయమై స్పష్టత లేకపోవ డంతో కాంట్రాక్టర్లు అయోమయానికి గురవు తున్నారు.



ఏకీకృత విధానంలో టెండర్లు..

రాష్ట్రంలో 1023 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, టీఎస్ రెసిడెన్షియల్ విద్యాలయాలున్నాయి. వీటిలో 6,46,486 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యా భ్యాసం చేస్తున్నారు. గతేడాది వరకు ఆయా సొసైటీలు ఒక్కో గురుకుల పాఠశాల, కళాశాల వారీగా, జిల్లా పర్చేస్ కమిటీల ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించే వారు. వీటితో స్థానికంగా ఉండే కాంట్రాక్టర్లకు, మరి కొందరికి ఉపాధి లభించేది. ఆ విధానానికి బదులు రాష్ట్ర వ్యాప్తంగా కొత్త విధానాన్ని ప్రభుత్వం తీసుక వచ్చింది. మెనూ ప్రకారం ఏఏ సరుకులను సరఫరా చేయాలనే విషయమై ఏకీకృత విధానాన్ని తీసుక వచ్చింది.

జిల్లా పర్చేస్ కమిటీల ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో ఉన్న గురుకుల విద్యాలయాలకు కలిపి ఆహార పదార్థాలు (కిరాణ సరుకులు) జిల్లా యూనిట్‌గా, కూరగాయలు-పండ్లు, మటన్-చికెన్, క్యాటరింగ్ కోసం మండల యూనిట్‌గా టెండర్లను ఆహ్వానించారు. ఆహార పదార్థాల్లో వంట నూనె, పాలు మినహాయించారు. నూనె, పాలు విజయ సంస్థలకు అప్పగించగా, కోడి గుడ్ల టెండర్లు జిల్లాల వారీగా నడుస్తున్నాయి. ఈ టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్, ఐటీ రిటర్న్స్, టర్నోవర్, అనుభవం చూపె ట్టాలి. ఇవేమి లేకుండా మండల సమా ఖ్యలు, యువజన బృందాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఒక్కో జిల్లాలో అన్ని సొసైటీలకు సంబంధించి 10 నుంచి 20కి పైగా గురుకుల విద్యాలయాలున్నాయి.

గత నెల 31 నుంచి టెండర్ నోటిఫి కేషన్లు జారీ కాగా, ఈ నెల 14వ తేదీ వరకు దర ఖాస్తులను స్వీకరించనున్నారు. 23న అర్హుల జాబితా ప్రకటన, 28న కాంట్రాక్టర్లకు ఆర్డర్లు జారీ చేయనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి క్యాటరింగ్ ఆరంభం కానుండగా, సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ఆహార పదార్థాలు, ఇతరత్రా కొత్త కాంట్రాక్టర్లు సరఫరా చేయనున్నారు. అప్పటి వరకు పాత కాంట్రా క్టర్లు సరుకులు సరఫరా చేయాల్సి ఉంటుంది.

టెండర్ల విధానంపై కాంట్రాక్టర్ల అసంతృప్తి..

టెండర్ల విధానంపై కాంట్రాక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టెండర్ ఫారాల ధరలను అడ్డగోలుగా నిర్ణయించడంపై మండిపడుతున్నారు. రాష్ట్రమంతటా ఏకీకృత విధానంలో టెండర్లు నిర్వహిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అన్ని జిల్లాలకు టెండర్ ఫారం ధర ఒకే విధంగా నిర్ణయించక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కొత్తగా మహిళా మండల సమాఖ్యలు, యువజన సంఘాలకు ప్రాధాన్యం ఇస్తామన్న ప్రభుత్వం రూ.25 వేలు చెల్లించి టెండర్లు వేస్తారా అనేది అనుమానమే. అలాగే జిల్లా యూనిట్‌గా అన్ని గురుకులాలకు ఒక్క కాంట్రాక్టరే ఆహార పదార్థాలను సరఫరా చేయడం సాధ్యం కాదంటున్నారు. టెండర్ వాల్యూపై సంవత్సరానికి 5 శాతం ఈఎండీ చెల్లించాలని, క్యాటరింగ్‌కు 75 వేల రూపాయల ఈఎండీ చెల్లించాలనే నిబంధన విధించడం గుదిబండగా మారనున్నదని కాంట్రాక్టర్లు అంటున్నారు.

గతంలో ఎస్సీ గురుకులాల్లో ఎస్సీలకు ఈఎండీలో 40 శాతం మాత్రమే చెల్లించాలనే నిబంధన ఉండేది. కానీ ఈ టెండర్లలో అలాంటి మినహాయింపులు లేక పోవడం గమనార్హం. ఈ విధానాలపై కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి గురుకులాల టెండర్ల విధానంలో సవరణలు చేయాలని కోరుతున్నారు. లేదంటే ఈ నెల 12వ తేదీ నుంచి అన్ని గురుకులాలకు సరుకుల సరఫరా, కేటరింగ్‌ను నిలిపి వేస్తామని తెలంగాణ గురుకులాల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రకటించింది. భవిష్యత్ కార్యాచరణపై ఈ నెల 7న గురువారం హైదరాబాద్‌లో సమావేశమవుతున్నారు.

ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల



వరద కాలువలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు

జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు అవసరాల కొరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్ద కాకతీయ కాలువ ద్వారా సాగునీటి సరాఫరాను తెలంగాణ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అవినాశ్ రెడ్డి, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. వానాకాలం సాగు సీజన్‌కు గానూ ఎస్సారెస్పీ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా వారాబందీ పద్ధతిలో సాగునీటి సరాఫరా కొనసాగించనున్నట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ అధికారులు గణేష్, కొండ వంశీ, విన్యాస్‌రెడ్డి, డీఈఈలు, ఏఈఈలు, టీఎస్ జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 2,153 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 40.582 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 46.654 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆర్ఎఫ్‌సీఎల్ వైఫల్యాలపై సీఎండీ సీరియస్

- ప్రాజెక్టు హెడ్ రాజీవ్ గుల్బేపై బదిలీ వేటు
- ప్రాజెక్టు ఇన్‌చార్జిగా రమేష్ ఠాకూర్

కోల్‌సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎఫ్‌సీఎల్‌లో వరుస వైఫల్యాలపై యాజమాన్యం సీరియస్‌గా స్పందించింది. ఆర్ఎఫ్‌సీఎల్ సీఎండీ సర్వనన్ ఇటీవల జరిగిన అమ్మోనియా లికేజీ ఉదంతాలను సీరియస్‌గా తీసుకున్నారు. దేశంలో యూరియా అవసరమైన సమయంలో ప్రాజెక్టులో అమ్మోనియా లీకేజీతో 18రోజులు షట్‌డౌన్ కావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో యూరియా కొరత ఏర్పడింది. తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు కేంద్రానికి లేఖలు రాశారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ నేరుగా కేంద్ర ఎరువుల శాఖమంత్రినే లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పించారు. ఈ పరిస్థితుల్లో రామగుండం ఎరువుల కర్మాగారానికి కమిటీని పంపి సీఎండీ విచారణ జరిపించారు. ఈ కమిటీ నివేదిక మేరకు ఏకంగా ప్రాజెక్టు హెడ్ రాజీవ్ గుల్బాపైనే వేటువేసినట్టు తెలుస్తోంది. ఆయనను ఎన్ఎఫ్ఎల్ హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేసి, ఆయన స్థానంలో ఆర్ఎఫ్‌సీఎల్‌లో మెకానికల్ డీజీఎంగా పనిచేస్తున్న రమేష్‌ఠాకూర్‌కు ప్రాజెక్ట్ హెడ్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. జూలై 1వ తేదీనే రాజీవ్ గుల్బా ఆర్ఎఫ్‌సీఎల్ హెడ్‌గా బాధ్యతలు స్వీకరించారు. నెల రోజులకే బదిలీ చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఇప్పటికే కేంద్ర కార్యాలయానికి ప్లాంట్‌కు మధ్య సమన్వయం కొరవడిందనే ఆరోపణలున్నాయి. నిర్ణయాలు త్వరగా జరగకపోవడంతో ప్లాంట్‌పై ప్రభావం పడుతోంది. ఇప్పటికైనా యాజమాన్యం పూర్తిస్థాయిలో ఆర్ఎఫ్‌సీఎల్‌పై దృష్టి పెడుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న యువతులు, తండావాసులు

చందుర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం దేవుని తండాలో తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులు గోధుమలను బుట్టలో వేసి తొమ్మిది రోజులు నియమనిష్టలతో ఉపవాసం ఉన్నారు. అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించి, చివరి రోజు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, తండా వీడీసీ అధ్యక్షుడు అజ్మీరా గణేష్, నాయకులు గబ్బర్ సింగ్, భక్తులు, తండా వాసులు, పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసుకోవాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లలో దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తయిందని, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ రామకృష్ణ తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ టీసీ, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాలకు వచ్చి సీటు కన్ఫర్మేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సీటు కన్ఫర్మేషన్ చేసుకోకపోతే సీటు రద్దు అవుతుందని తెలిపారు. శుక్రవారం సీటు కన్ఫర్మేషన్‌కు చివరి తేదీ అని తెలిపారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ ఎన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ఆధ్వర్యంలో డాక్టర్ బీఎన్‌రావు హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. హుజూరాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, నూకపల్లి నాక్ కేంద్రాల ద్వారా పలువురు నిరుపేద మహిళలను ఎంపిక చేసి నెలరోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎన్ రావు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, మహిళా శక్తిని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ఫౌండేషన్ ముందుకు సాగుతుందన్నారు. ట్రైనింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రామాణిక శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ రూప్సీ, డాక్టర్ శ్రీదేవి, గంగ, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జగిత్యాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని దరూర్ క్యాంపులోని కోదండ రామాలయ ప్రాంతంలో ప్రభుత్వ నిషేధిత గంజాయి కలిగి ఉన్న జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన యువకుడిని జగిత్యాల టౌన్ ఎస్సై కుమారస్వామి పట్టుకున్నారు. అతని వద్ద 105 గ్రాముల గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పింఛన్లు పెంచకపోతే సీఎంను గద్దె దించుడే..

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

హుజూరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు పెంచకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గద్దె దించుడం ఖాయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల దివ్యాంగులు, వృద్ధుల పింఛన్‌దారుల సన్నాహకసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు, వృద్ధులకు పింఛన్లు ఇవ్వకపోతే ప్రతిపక్ష పార్టీలు ముఖ్యమంత్రిని నిలదీయాలన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటఇచ్చిన ప్రకారం అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచారన్నారు. తెలంగాణలో మాత్రం 20నెలలు దాటినా ఇవ్వడం లేదన్నారు. 13న జరిగే సభ కంటే ముందు పింఛన్లు పెంచకపోతే సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ ఉరి తప్పదన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడుతున్న బాలికలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి అల్ఫోర్స్ పాఠశాలలో రెండురోజులుగా నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. రెండోరోజు గురువారం అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలతో గుర్తింపు లభిస్తుందని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

- రెండో రోజు ఫలితాలు..

అండర్-14 విభాగంలో టీం ఈవెంట్‌లో వీపీఎస్ పబ్లిక్ స్కూల్ టైమ్ స్కూల్‌పై 1 పాయింట్ తేడాతో గెలుపొందింది.

అండర్-17 విభాగంలో శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ 3-0 పాయింట్ల తేడాతో సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌పై గెలుపొందింది. అండర్-19 విభాగంలో శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్‌పై 3-0 పాయింట్ల తేడాతో గెలుపొందింది.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి నారాయణ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తారకరామనగర్‌కు చెందిన జగన్నాథం సమ్మయ్య, బల్లని సారయ్యతో పాటు మరికొంత మంది కలిసి నిత్యం తాటిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతుండేవారు. చాలా రోజుల నుంచి సమ్మయ్య పేకాటలో డబ్బులు గెలుస్తూ ఉండేవాడు. ఎలాగైనా పేకాటలో సమ్మయ్యపై గెలవాలని సారయ్యతో పాటు అతని మేనల్లుడుతో కలిసి కోరుట్ల ప్రాంతంతో పేకాట ఆడారు. మరోసారి సమ్మయ్యనే గెలువడంతో అతనిపై సారయ్య కక్ష పెంచుకున్నాడు. పథకం ప్రకారం పేకాట ఆడేందుకు సమ్మయ్యను 2021 ఆగస్టు 28న ద్విచక్ర వాహనంపై తాటిపల్లి గ్రామ శివారులోని పెద్దయ్య చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి బండరాయితో కొట్టి హత్యకు పాల్పడ్డారు. అనంతరం సమ్మయ్య మృతదేహాన్ని చెరువులో పడేసి వెళ్లిపోయారు.

మృతుడి కుటుంబసభ్యులు జగిత్యాల రూరల్ పోలీసులకు సమ్మయ్య కనబడడం లేదని ఫిర్యాదు చేశారు. తాటిపల్లి గ్రామ శివారులోని చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యంకాగా పోలీసుల విచారణలో మృతదేహాన్ని సమ్మయ్యదిగా గుర్తించారు. హత్యకు పాల్పడ్డ వ్యక్తి సారయ్యతో పాటు అతడి మేనల్లుడు(బాలుడి)గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ కృష్ణకుమార్, ఎస్సై చిరంజీవి, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, రాజులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సారయ్యకు జీవితఖైదు విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడు బాలుడు కావడంతో జువైనల్ కోర్టులో కేసు విచారణ జరుగుతున్నట్లు కోర్టు అధికారులు పేర్కొన్నారు.

చేనేత కాంతిరేఖ

- కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు అందుకున్న వెల్ది రేఖ
- రాజన్న సిరిపట్టు పితాంబరానికి అరుదైన గౌరవం



రేఖకు అవార్డు అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అవార్డుతో రేఖ

సిరిసిల్ల ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారిణి వెల్ది రేఖ నేసిన రాజన్న సిరిపట్టు పితాంబరం చీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును రేఖ అందుకున్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో చేనేత కళాకారులు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నారు. అదే బాటలో మహిళా చేనేత కార్మికులు సైతం అద్భుతాలు సృష్టిస్తున్నారు. చేనేత రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా భావించే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును రాష్ట్రంలో అందుకున్న తొలి మహిళగా వెల్ది రేఖ నిలిచింది. చేనేత రంగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ సతీమణి రేఖ చేనేత మగ్గంపై సృష్టించిన రాజన్న సిరిపట్టు పట్టు పీతాంబరానికి ఈ అరుదైన గౌరవం పొందారు. 45 రోజులపాటు శ్రమించి చేనేత మగ్గంపై రూపొందించిన పట్టుచీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని తెలియజేసేలా చేనేత దంపతులు హరిప్రసాద్, రేఖలు ఈ పట్టు పీతాంబరాన్ని రూపొందించారు. రూ.36 వేల విలువైన 48 ఇంచుల వెడల్పు, ఐదు మీటర్ల పొడవు, 605 గ్రాముల బరువుతో ఉన్న ఈ పట్టు చీరలో కాకతీయుల శౌర్యానికి గుర్తు అయిన కమాన్‌తో పాటు వేములవాడ రాజన్న కోడె మొక్కులను సూచించే జరీబుటాలను పొందుపరిచారు. సిరిసిల్ల చేనేత వనితనానికి గుర్తుగా నూలు వడుకుతున్న మహిళ బొమ్మతో కూడిన జరీబుటాను పట్టుచీరపై నేసి అబ్బురపరిచారు.

చేనేత రంగంలో నిత్యం ప్రయోగాలే..

సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారులైన వెల్ది హరిప్రసాద్, రేఖ దంపతులు దశాబ్ద కాలంగా నిత్యం ప్రయో గాలు చేస్తూ అద్భుతాలు సృష్టిస్తున్నారు. నేత పరిశ్రమకు కేంద్రమైన సిరిసిల్ల ఖ్యాతిని ఇనుమడించేలా రాజన్న సిరిపట్టు చీరను రూపొందించారు. అంతేకాక చేనేత రంగంలో కనీవిని ఎరగని రీతిలో అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీర, దబ్బనంలో దూరే పట్టు చీరతో పాటు జీ20 లోగోను మగ్గంపై నేసి ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసలు సైతం అందుకున్నారు. ఇటీవల హైదరాబా ద్ కేంద్రంగా జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లో చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ తన ప్రతిభను ప్రదర్శించారు. హరిప్రసాద్ నేసిన చేనేత కళారూపాలను చూసి దేశవిదేశాలకు చెందిన సుందరీమణులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. హరిప్రసాద్ నేసిన పలు పట్టు చీరలను వస్త్రాలుగా కుట్టి మిస్ వరల్డ్ పోటీ మహిళలు ర్యాంప్ వాక్ చేశారు. చేనేత రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న హరిప్రసాద్ దంపతులను పలువురు అభినందిస్తున్నారు.

ఆదివరాహస్వామి జయంత్యుత్సవాలు ముగింపు



స్వామి వారికి అభిషేకం చేస్తున్న పూజారులు

కమాన్‌పూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆదివరాహ స్వామి జయంత్యుత్సవాలు గురువారం ముగిసాయి. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేశారు. ఆలయ వేదపండితులు హోమం నిర్వహించారు. ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఉదయమే సుప్రభాతం, నిత్య తిరువారాధన, సేవాకాలం, నిత్యాభిషేకం, గోపూజ, 108 కలశాలతో ఆదివరాహ స్వామికి అభిషేకం చేశారు. చివరగా పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు కలకుంట్ల వరప్రసాదస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈవో కాంతారెడ్డి సౌకర్యాలు కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

మంథనిరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురవాలని సూరయ్యపల్లి గ్రామస్థులు గురువారం గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కప్పతల్లిని భుజాన మోస్తూ గ్రామ పుర వీధుల్లో డప్పు చప్పళ్లతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలంతా బిందెల్లో నీళ్లతో ఊరేగింపులో పాల్గొని గ్రామంలోని హనుమాన్ గుడివద్ద హనుమాన్ విగ్రహానికి 108 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కప్పతల్లిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు 12 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డీఆర్‌వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 12 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే వంట సరుకులకు సంబంధించిన బిల్లులు 2023 నుంచి రాలేదని తెలిపారు. దీనిపై అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. తక్షణమే బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు 10వేల రూపాయల వేతనం చెల్లిస్తామని మాట ఇచ్చారని అన్నారు. కనీస వేతనం ఇవ్వడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ గ్రీన్ ఛానల్ ద్వారా పీఎఫ్, ఎంఎస్ ద్వారా బడ్జెట్ విడుదల చేసి నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ సాయిలు, ప్రధాన కార్యదర్శి రజిత, కార్యదర్శి దేవేంద్ర, ఎం లక్ష్మి, బి భాగ్య, హాలియా తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాతో.. రూ. 2,500 జమ నమ్మవద్దు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్‌లో అకౌంట్ ఉంటే మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు 2,500 రూపాయలు జమ చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వదంతులు నమ్మవద్దని, ఇది అసత్య ప్రచారమని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఫేక్ న్యూస్‌లను నమ్మవద్దని, ఇందులో ఎలాంటి వాస్తవమూ లేదని తెలిపారు. ప్రభుత్వపరమైన నిర్ణయాలను రాష్ట్ర, జిల్లా యంత్రాంగం అధికారికంగా ధ్రువీకరిస్తేనే వాస్తవంగా పరిగణించాలని పేర్కొన్నారు.

బైక్ పైనుంచి పడి యువతి మృతి

కొడిమ్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాలకు చెందిన గుర్రం మమత(30) అనే యువతి బుధవారం రాత్రి మండలంలోని చెప్యాల గ్రామ శివారులో బైక్ పై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై గురువారం తెలిపిన వివరాల మేరకు మమతకు పరిచయం ఉన్న తాటిపల్లి గ్రామానికి చెందిన గంగార స్వామి అనే వ్యక్తితో వేములవాడ నుంచి బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో మమత కుడి కాలు వెనుక టైరులో చిక్కుకొని కింద పడింది. దీంతో ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి వెళ్లేలోపు మృతి చెందింది. మృతురాలి తల్లి గుర్రం శంకరవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బురద రోడ్డుపై వరినాటు వేసిన యువకులు

కొడిమ్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారాంతండా గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు బురదమయంగా మారింది. దీంతో గ్రామ యువకులు పలువురు గురువారం బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. బురద రోడ్లపై మట్టి పోసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులను ప్రజలు కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ తదితరులు ఉన్నారు.

కొండగట్టులో రూ.50 లక్షలతో షెడ్డు

మల్యాల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కొండగట్టు కొండపైన భక్తుల సౌకర్యార్థం దేవస్థానం తరుపున మరో షెడ్డు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి రెండు వైపులతో పాటు బస్టాండ్ ప్రాంతంలో షెడ్లు భక్తులకు అందుబాటులో ఉన్నాయి. వర్షాకాలంలో భక్తులు తలదాచుకోవడానికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రూ. 50 లక్షలు ప్రతిపాదిత వ్యయంతో టెండర్లు నిర్వహించగా కల్యాణకట్ట ప్రాంతంలోని సెల్‌టవర్ వద్ద పనులు ప్రారంభించారు. గుంతల పనులు పూర్తికాగా మిగితా పనులను త్వరగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు.

'ఈ పాస్' ద్వారానే ఎరువులు పంపిణీ చేయాలి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఈ పాస్ యంత్రాల ద్వారా మాత్రమే ఎరువుల పంపిణీ చేయాలనీ తహసీల్దార్ వరప్రసాద్ సూచించారు. మండలంలోని డబ్బా గ్రామంలోని డీసీఎంఎస్ ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ అధికారి ఎ రాజ్‌కుమార్‌తో కలిసి తహసీల్దార్ ప్రసాద్ తనిఖీ చేశారు. ఎరువులు వివరాలు బిల్ బుక్స్, రిజిస్టర్ ఈపాస్ మిషన్‌లో అమ్మకాలను పరిశీలించారు. ఎరువులను ఈ పాస్ ద్వారా మాత్రమే అమ్మకాలు చేపట్టాలని సూచించారు. మండలంలో ఇప్పటికే 1700 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకి అందుబాటులో ఉంచామన్నారు. రైతులు తమకు అవసరం ఉన్నంతవరకే యూరియా కొనుగోలు చేసి సహకరించాలని కోరారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం




ముత్యంపేటలో నేతన్నలను సన్మానిస్తున్న నాయకులు, రాట్నం వడుకుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కోరుట్ల, అగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చేనేత సహకార సంఘ భవనంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు గోనే శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, సంఘ సభ్యులు బండ్ల రవికుమార్, గోసికొండ కుమారస్వామి, ఆందె రాజ్‌కుమార్, జిల్లా ధనుంజయ్, గడ్డం మధు, చెన్న విశ్వనాథం, మచ్చ కవిత, ఎక్కలదేవి రాంచందర్, నల్ల ప్రశాంత్, పడాల గణేష్, ఎక్కల దేవి నవవీన్, ముల్క ప్రసాద్, ఆడెపు నరేష్ పాల్గొన్నారు.

మల్యాల: మండలంలోని ముత్యంపేటలో మార్కండేయ యువజన సంఘం ఆధ్వర్యంలో చేనేత వృత్తి చేసిన జనార్దన్, భూమయ్య, మల్లేశం, ఎల్లయ్య, మల్లయ్యను సన్మానించారు. మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు ముల్క మల్లయ్య, సామల దేవరాజం, కట్కూరి రాజేశం, బాలే కుమార్, చెట్‌పల్లి చక్రధర్, బాలే వంశీకృష్ణ, శ్రీనివాస్, మహేందర్, సామల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం చేనేత కార్మికులను ఘనంగా సన్మానించారు. రాయికల్ పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు బోగ రాజేశం, ఉపాధ్యక్షుడు దాసరి గంగాధర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి ఆడెపు నర్సయ్య, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు సామల్ల సతీష్, ఉపాధ్యక్షుడు సింగని సతీష్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజీవ్, కోశాధికారి బొమ్మకంటి నవీన్, సంయుక్త కార్యదర్శి గంట్యాల ప్రవీణ్, మాజీ అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, సభ్యులు పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండల కేంద్రంలోని పద్మశాలీ సంఘం భవనంలో పద్మశాలి సంఘం పట్టణ, మండల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మార్కండేయ స్వామి చిత్ర పటానికి పూలమాలలు వేశారు. పద్మశాలి సంఘం మండల ప్రధాన కార్యదర్శి అంకం భూమయ్య, మాజీ ప్రజా ప్రతినిధులు అలిశెట్టి రవీందర్, కొక్కుల భూమయ్య, ఒడ్నాల ఆంజనేయులు, పట్టణ శాఖ అధ్యక్షులు చౌట్‌పెల్లి తిరుపతి, ప్రధాన కార్యదర్శి అందే లక్ష్మణ్, కోశాధికారి అంకం లింబాద్రి, ఉపాధ్యక్షులు ఎనగందుల శంకర్, మార్కెట్ డైరెక్టర్ కొక్కుల జలేంధర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రం, మండలంలోని పూడూర్ గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పద్మశాలీ సంఘం నాయకులు అంకం రాజేశం, సత్యనారాయణ, మనోజ్‌కుమార్, భూమేష్, హన్మండ్లు, పరమేశ్వర్, మనోహర్, నారాయణ, లక్ష్మీపతి, రాజమల్లయ్య, రాజేశం, అశోక్, గంగాధర్, మారుతి మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

పెరుగుతున్న జ్వర పీడితులు

(5వ పేజీ తరువాయి)

ఉన్న నీరు, పాత డబ్బాలు, పూల కుండీల్లో ఉన్న నీటిని ఎప్పటికప్పుడు దగ్గరుండి పారబోయిస్తున్నారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, కిటీలకు, తలుపులకు మెష్‌లను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నారు. యాంటి లార్వా ద్రావణాలను పిచికారి చేయిస్తున్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

-డాక్టర్ నీలారపు శ్రీనివాస్, జిల్లా సర్వైలెన్స్ అధికారి



జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణలో భాగంగా ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఫీవర్ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. ఇంటింటికీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది వెళ్లి సర్వే చేస్తున్నారు. జ్వర పీడితులను గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రజల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నాం.

మృతిలోనూ సోదరబంధం

● గుండెపోటుతో సోదరుడి మృతి.. రాఖీ కట్టిన అక్కాచెల్లెలు



సోదరుడి మృతదేహానికి రాఖీ కడుతున్న సోదరీమణులు

మల్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తోడబుట్టిన సోదరుడు అకాల మృతితో సోదరీమణులు తల్లడిల్లారు. రాఖీ పండగకు రెండు రోజుల ముందు గుండె పోటు రూపంలో సోదరుడిని మృత్యువు కబలించుకుపోవడంతో సోదరీమణులు ఆయన మృతదేహానికి రాఖీ కట్టి తమ సోదరబంధాన్ని చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మల్యాల మండల కేంద్రానికి చెందిన పోతుగంటి భీమయ్యగౌడ్(65) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. కాగా గురువారం అంత్యక్రియలకు ముందు భీమయ్య అక్క భాగ్యలక్ష్మి, చెల్లె నాగమ్మ మృతదేహానికి రాఖీలు కట్టారు. శనివారం రాఖీ పండగ కావడం, రెండు రోజుల ముందే సోదరుడు మృతిచెందడంతో వారు రాఖీ కట్టారు. సోదరీమణు లతో పాటు కూతురు గౌతమి కూడా తన మేనత్తలతో కలిసి తండ్రికి రాఖీ కట్టింది. ఈదృశ్యం అక్కడ ఉన్న వారిని కంటతడి పెట్టించింది.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు

- అరకిలో గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

కోరుట్ల, అగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ ప్రాంతంలో ఆరుగురి వ్యక్తుల వద్ద అరకిలో గంజాయి ఉన్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ సురేష్ తెలిపారు. గురువారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో కోరుట్ల ఎస్ఐ చిరంజీవి, రామచంద్రంలతో కలిసి సీఐ సురేష్ వివరాలను వెల్లడించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్ ప్రాంతంలో కొందరు వ్యక్తుల గంజాయి సేవిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఎస్ఐ చిరంజీవి, రామచంద్రంలు ఆ ప్రాంతానికి వెళ్లి సోదాలు చేయగా ఆరుగురు వ్యక్తులు ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద అరకిలో గంజాయి ఉండగా స్వాధీనం చేసుకొని వారిని స్టేషన్‌కు తరలించి విచారించామన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని గంజ్ ప్రాంతానికి చెందిన అమీర్ ఖాన్, జిందా మహేల్, ఎండీ ముషా, పోచమ్మవాడకు చెందిన ఎండీ సోహేల్, కోరుట్ల పట్టణంలోని ఐబీ రోడ్డుకు చెందిన అబ్దుల్ హరీర్, షేక్ మజీద్, బెండపల్లికి చెందిన ఉమర్‌లుగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. ఆరుగురు వ్యక్తులు మూడు ద్విచక్ర వాహనాలపై నిర్మల్ జిల్లా కేంద్రంలో గంజాయి కొనుగోలు చేసి కోరుట్ల, జగిత్యాల పట్టణాల్లో యువకులకు గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద ఉన్న గంజాయి తోపాటు మూడు ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోని వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ చిరంజీవి, రామచంద్రుడు, పోలీసు సిబ్బంది పురుషోత్తం, గట్టు శ్రీనివాస్, రాజేశ్వర రావును పోలీస్ ఉన్నతాధికారులు, సీఐ సురేష్ అభినందించారు.

చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్

ధర్మపురి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నీలారపు శ్రీనివాస్ కోరారు. ధర్మపురి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జాతీయ నులి పురుగు దినోత్సవంపై అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్న పిల్లలకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆగస్టు 11 న అల్బెండజోల్ మాత్రలు ఇస్తామని తెలిపారు. అల్బెండజోల్ మాత్రలు ఇంటికి ఇవ్వవద్దని, ఆరోజు వేసుకోని వారికి తిరిగి ఆగస్టు 18న మాత్రలు ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో ధర్మపురి ఎంపీడీవో రవీందర్, మండల నోడల్ అధికారి శంకరయ్య, మున్సిపల్ మేనేజర్ బాలె గంగాధర్, నేరెళ్ల పీహెచ్‌సీ డాక్టర్ శివకుమారి, హెల్త్ సూపర్‌వైజర్ అల్లంకి శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లి/కథలాపూర్: 1 నుండి 19 ఏండ్ల లోపు ప్రతి ఒక్కరికి అల్బెండాజోల్ మాత్రల పంపిణీ చేయాలని పెగడపల్లి, కథలాపూర్ ఎంపీడీవోలు శ్రీనివాస్‌రెడ్డి, శంకర్‌నాయక్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాల యంలో నులిపురుగు నివారణ మాత్రల పంపిణీపై ఆరోగ్య, విద్య, అంగన్‌వాడీ శాఖల అధికారులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగస్టు 11న అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కాలేజీల్లో మాత్రల పంపిణీ చేయడం జరుగుతుందని అన్ని శాఖలు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ రవీందర్, వైద్యాధికారి నరేష్, ఎంఈవో సులోచన, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివాలి

మల్యాల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ఉన్నతంగా ఎదుగుతారని సైకలాజిస్ట్ కార్పొరేట్ ట్రైనర్ అడ్డిగ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ అన్నారు. మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు చదవడం, ఏకాగ్రత, క్రమశిక్షణ, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుంచే పెద్దలను, గురువులను గౌరవించడం అలవరుచుకోవాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని అన్నారు. అనంతరం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మల్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న పలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలంటూ మండల బీజేపీ నాయకులు గురువారం తహసీల్దార్ వసంతకు వినతిపత్రం అందించారు. సాగు కోసం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయాలని, మల్యాలలో జగ్గనిబావి మరమ్మతులు, సర్వాపూర్‌లో క్రీడాప్రాంగణం, వరదకాలువ పక్కన డంపింగ్ యార్డులో ఆక్రమాలు నివారించాలని, గొల్లపల్లెలో వరదనీరు ఇళ్లలోకి వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవడానికి గానూ సంబంధింత అధికారులు చర్యలు తీసుకునే విధంగా ఆదేశించాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో మల్లేశం, రవి, కొల్లూరి గంగాధర్, జనగాం రాములు, రమేశ్, ప్రసాద్, సామ మహిపాల్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రుత్త కిషన్, శ్రీనివాస్, బండారి రాజు, మౌర్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలి



ఇటిక్యాలలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

జగిత్యాలరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ప్రతీ బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించాలని జగిత్యాల సీడీపీవో మమత సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జగిత్యాల రూరల్ మండ లంలోని కల్లెడ గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సీడీపీవో మమత ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజశ్రీ పాల్గొన్నారు.

పెగడపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. సూపర్‌వైజర్ మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు రమ, సుజాత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని వెల్లుల్లలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ కృష్ణవేణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీం సుల్తానా హెల్త్ సూపర్‌వైజర్ మహేశ్వరి, ఏఎన్ఎమ్ వసంత, అంగన్‌వాడీ టీచర్లు శ్రీదేవి, రాజేశ్వరి, ప్రమీల, సుజాత, నాగమణి, పద్మ, శారద పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఒడ్డెర కాలనీ, ఇటిక్యాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన వేడుకల్లో అంగన్‌వాడీ టీచర్లు బియ్యని సుజాత, కుంట సుజాత, మామిడి బుజ్జమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తి అంగన్‌వాడీ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరైన డీసీసీ మాజీ సెక్రెటరీ పెంట లింబాద్రి, నాంపల్లి వెంకటాద్రి, బుర్రి ముత్యం, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో భారీ వర్షం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం భారీ వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో ఉదయం కురిసిన వర్షానికి రోడ్లన్నీ బురదతో నిండిపోయాయి, పట్టణంలోని భవానీ నగర్, గణేష్ నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో రోడ్లన్నీ వర్షం నీటితో నిండిపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ధర్మపురి మండలంలో..



ధర్మపురిలోని కాశెట్టివాడలో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

ధర్మపురి: ధర్మపురి మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ధర్మపురి పట్టణంలోని కాశెట్టివాడలో డ్రైనేజీ నిర్మాణం కోసం కంట్రాక్టర్ పనులు చేసి వదిలి పెట్టాడు. దీంతో డ్రైనేజీలో బండలు పడి కాలువల ద్వారా నీరు ఇళ్లలోకి చేరింది. కొందరు ఇళ్లలోని బియ్యం సంచులు, సామాన్లు తడిసి ముద్దయ్యాయి. మాజీ కౌన్సిలర్ బండారి అశోక్, సోమిశెట్టి శివసాయి, చీపిరిశెట్టి రమేష్ డ్రైనేజీలో దిగి బండలు తీసివేయడం వల్ల కొంత నీరు తగ్గిపోయింది. అలాగే పట్టణంలోని ప్రధాన రోడ్లు, బ్రాహ్మణవీధిలో కూడా వర్షానికి నీరు నిలిచిపోవడం వల్ల గోదావరి నది స్నానాలు, దైవ దర్శనం కోసం వచ్చే భక్తులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలంలోని దమ్మన్నపేట, రాజారం, పెద్దనక్క లపేట, జైనా, తీగలధర్మాం, దొనూర్, రామయ్యపల్లె, తుమ్మెనాల తదితర గ్రామాల్లో కూడా కురిసిన వర్షం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. మండలంలో 27.8 ఎంఎం వర్షపాతం నమోదైంది.

ధర్మపురి ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా వరప్రసాద్



ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వరప్రసాద్, కార్యవర్గ సభ్యులు

ధర్మపురి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా కొంక వరప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో జర్నలిస్ట్ సోమిశెట్టి మురళి అధ్యక్షతన ప్రెస్ క్లబ్ సభ్యులు గురువారం సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా చిలుముల రాజేందర్, ఉపాధ్యక్షులుగా వడ్లూరి రవీందర్, రెంటం శంకర్ ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పలువురు సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కాగా నూతన కార్యవర్గాన్ని డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్, ధర్మపురి పీఏసీఎస్ ఛైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ధర్మపురి మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, బుగ్గారం మాజీ జడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ అయ్యోరు రాజేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్ తదితరులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు స్తంభంకాడి శ్రీనివాస్, కోరుట్ల శ్రీరాములు, స్తంభంకాడి అశోక్, రేణికుంట రమేష్, అర్షి శ్రీకాంత్, ఉత్తెం పెద్దన్న, రంగు శ్రీనివాస్, కళ్యాడపు శ్రీనివాస్, చీర్ల రమేష్, కొంక సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

మల్యాల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ప్రాంతంలో కోతులకు ఆహారం అందించే కార్యక్రమంలో భాగంగా జగిత్యాలలోని రామకృష్ణ, ఎస్ఎస్‌పీ కళాశాలలకు చెందిన విద్యార్థులు గురువారం కొండగట్టులో పళ్ల మొక్కలు నాటారు. అటవి శాఖ, నేచరల్ లవర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్లనేరేడు, రేగు, సీతాఫలం, మేడి, చింత, జామ తదితర అనేక రకాల 500 మొక్కలు నాటారు. కోతులకు ఆహారం సరిగా అందక పోవడంతో గ్రామాల్లోకి వస్తున్నాయని, రహదారులపై ప్రమాదాలకు గురి అవుతుండడంతో వాటి సంరక్షణకే పళ్ల మొక్కలు నాటినట్లు ఫౌండేషన్ నిర్వాహకులు ఈ సందర్భంగా అన్నారు.

రాఖీ పంపిణీ

కోరుట్ల, అగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : "ఆపరేషన్ సింధూర్" విజయం సాధించి భారత దేశంను అన్ని రంగాలలో ముందుకు నడిపిస్తున్న దేశ పరిరక్షణ కోరకు దేశ ప్రదాని నరేంద్ర మోది చేస్తున్న సాహసాలను స్వాగతిస్తూ పట్టణంలోని బాలికల పాఠశాల విద్యార్థులు జాతీయ వాదనంను చాటుకున్నారు. రక్ష బందన్ సందర్భంగా విద్యార్థులు భానుగ్న, సంజన, సాయిశ్రీ, శరణ్య, మనుశ్రీ, పూజ, లిఖిత చైత్రవిలు రాఖీని తయారు చేసి భారత ప్రదాని నరేంద్ర మోదికి పంపిచారు. భారత్‌లోని 140 కోట్లు ప్రజలకు రక్షలుగా నిలిచిన ఆకాశ్, బ్రహ్మోస్, రాఫెల్ మరియు ఎస్ 400 చిత్రాముల రాఖీలో ప్రదర్శించి విద్యార్థులు రాఖీను తయారు చేసి ఉపాధ్యాయుల ప్రశంసలను అందుకున్నారు. విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించిన చౌప్ల లక్ష్మీనారాయణ, చంద నాగరాజు, బాస సుమలత, పిస్క వేణుల సహకారంతో విద్యార్థులు రాఖీ చేసినట్లు ప్రదానోపాధ్యాయుడ కృష్ణమోహన్ రావు తెలిపి విద్యార్థులను ఉపాధ్యాయులను అభినందించారు.

విద్యార్థులను ఇంటికి పంపాలని ఆందోళన

మెట్‌పల్లిటౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను ఇంటికి పంపించాలని డిమాండ్ చేస్తు గురువారం పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల ముందు విద్యార్థుల తల్లితండ్రులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పిల్లలను రాఖీ పండగ సందర్భంగా ఇంటికి పంపించాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను తల్లిదండ్రులు కోరగా పంపించడం లేదని ఆరోపిస్తూ రోడ్డుపై రాస్తారోకో చేశారు. అరగంట పాటు ఆందోళన చేపట్టడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పాడింది. తమకు ప్రభుత్వం సెలవు ఇవ్వలేదని, ప్రభుత్వం ప్రకటిస్తే విద్యార్థులను ఇంటికి పంపిస్తామని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. సొంత సెలవులపై తీసుకెళ్లాలని తెలపడంతో తల్లిదండ్రులు అనుమతి తీసుకొని కొంత మంది పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు.

ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులతో పోలీస్ అధికారులు

జగిత్యాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని పట్టణ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల ఆవరణలో వివిధ పాఠశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సైలు మల్లేశం, కుమార స్వామి, రవి కిరణ్, సుప్రియలకు రాఖీలు కట్టారు. కార్యక్రమంలో అభ్యాస పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

జగిత్యాలరూరల్: మండలంలోని అంతర్గాం ప్రభుత్వ పాఠశాలలో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయుడు సింగు సత్తయ్య, ఉపాధ్యాయులు చీటి భూపతిరావు, బాలె సరోజ, ఎర్రోజు అనిత, మాడ రజనీకర్‌రెడ్డి, భోగ రాజేందర్, వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వర్‌రావు, పక్రుద్దీన్, శీలం శరత్, లలిత పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామంలో బస్తీ కాలనీలో ధర్మ జాగరణ ఆధ్వర్యంలో ఇంటింటికీ రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ధర్మ జాగరణ ప్రముఖ్ సురేందర్, బొంగు రాజు, పారిపెల్లి శ్రీనివాస్, పంచతి నరేష్, పంచతి బాలరాజు, పంచతి రాజేందర్, పడాల శ్రీనివాస్, పడాల తిరుపతి పాల్గొన్నారు. మండలంలోని మైతాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేడుకలు నిర్వహించారు.

కోరుట్ల: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఆర్ఎస్ఎస్ సభ్యులు, బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో పట్టణంలోని బార్ అసోసియేషన్ సభ్యులు వేడుకలను నిర్వహించారు.

మెట్‌పల్లి రూరల్: మండలంలోని జగ్గసాగర్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలోతి జరిగిన వేడుకల్లో బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, నాయకులు ఏసాల సంపత్, ప్రధానోపాధ్యాయులు కోట ప్రభాకర్, బూస లక్ష్మణ్ పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో చిన్నారులు వివిధ రకాల వృత్తుల వేశధారణలో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్ రావు, డైరెక్టర్ తిరుపతి రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం ఉమ్మెంతుల వెంకటరమణి, ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, సురేష్, రాజగోపాల్, భవానీ, శైలజ, పుష్పలత, సరోజిని పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంలోని సిద్ధార్థ హైస్కూల్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు.

కొడిమ్యాల: మండలంలోని పూడూర్, ఆరెపల్లి గ్రామాల్లోని పాఠశాలలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ముందస్తు రక్షా బంధన్ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు స్వయం సేవకులు మల్లేశం, శ్రీనివాస్, రవి, అశోక్, నర్సయ్య, అజయ్, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'దాడి చేసిన వ్యక్తులను అరెస్ట్ చేయాలి'

గొల్లపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆకారణంగా ఇంట్లోకి చొరబడి దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన నిందితులను వెంటనే ఆరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గొల్లపల్లి నల్లగుట్టకు చెందిన పలువురు పోలీసుస్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి గురువారం ఆందోళన నిర్వహించారు. గొల్లపల్లి మండలంలో అమాయకులపై దాడులు చేసి తీవ్రంగా గాయపర్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని జగిత్యాల-ధర్మారం ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. కాలనీకి చెందిన పలువురు మహిళలు, యువకులు పోలీసు స్టేషన్ వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నల్లగుట్ట ప్రాంతానికి చెందిన దండ్ల శ్రీనివాస్ అనే వ్యక్తిని అదే కాలనీకి చెందిన ఓర్సు విజయ్, ఇడగొట్టు సురేందర్, తిరుపతి అనే ముగ్గురు వ్యక్తులు ఈ నెల 4వ తేదిన ఇంట్లోకి అక్రమంగా చొరబడి దౌర్జన్యం చేస్తూ భౌతిక దాడి చేసి తీవ్రంగా గాయపర్చారన్నారు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి ఇప్పటిరవకు నిందితులను అరెస్ట్ చేయలేదన్నారు. చేశారు. ఆందోళన కారుల వద్దకు వచ్చిన ఎస్సై వారిని శాంతింప చేయడానికి యత్నించినా వారు వినలేదు. నిందితులను అరెస్ట్ చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది అంటూ ఆందోళనను కొనసాగించారు. సమాచారం తెలుసుకున్న ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి సంఘటనా స్థలికి చేరుకొని ఆందోళన కారులతో మాట్లాడారు. నిందితులు పరారీలో ఉన్నారని, వారిని వెతికి పట్టుకుని రిమాండ్‌కు తరలించి బాధితుడికి న్యాయం జరిగేలా చూస్తామని సీఐ హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయింపు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చూసుకుంటానని మోసం చేశాడని మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఓ యువకుడి ఇంటి ఎదుట యువతి గురువారం బైఠాయించింది. గ్రామస్థులు, బాధితురాలి కథనం ప్రకారం గ్రామంలోని ఒక యువకుడు ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి గర్భవతిని చేశాడు. అనంతరం పెళ్లికి నిరాకరించడంతో గురువారం బాధిత యువతి ప్రియుడు ఇంటిముందు బైఠాయించింది. విషయం తెలుసుకున్న యువకుడు, అతడి కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు.

నీటి విడుదలపై సంబరాలు

కథలాపూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వరద కాలువకు శ్రీరాంసాగర్ నుంచి నీటిని విడుదల చేయడం పట్ల మండల కేంద్రంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ రైతుల పంటలు ఎండిపోతున్నాయని రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డికి దృష్టికి తేవడంతో నీటి విడుదల జరగడం హర్షణీయమన్నారు. దీంతో కథలాపూర్, బీమారం, మేడిపల్లి మండలాల రైతులకు ఎంతో మేలు జరగనుందని అన్నారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, లింగారావు, రిక్కల సంజీవ్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

పోచమ్మ ఆలయంలో పూజలు

మెట్‌పల్లి టౌన్, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసాన్ని పురస్కరించుకొని గురువారం మెట్‌పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పోచమ్మ దేవా లయం లో మొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మైలారం రాంబాబు సంతోషిని దంపతులు అమ్మవారికి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎల్మీ రవి, జ్యోతి, సంయుక్త కార్యదర్శి కొత్త నవీన్, వాసవి గార్డెన్ అధ్యక్షులు కోట కిరణ్, కుమార్ వాసవి దేవాలయం అధ్యక్షులు చాడ సురేష్ పావని, సేవాదళ్ అధ్యక్షులు దొంతుల సంతోష్, మహిళా సంఘం అధ్యక్షురాలు పుల్లూరి మధుమిత, నవీన్, వాసవి దేవాలయం కార్యదర్శి చిట్టి మిల్లి శ్రీనివాస్, పాము అమర్నాథ్, సంధ్య, జొన్న శ్రీనివాస్ స్వరూప, సాయిరాం పాల్గొన్నారు.